# స్వచ్ఛభారత్ నగరాల్లో తిరుపతి

- దేశవ్యాప్తంగా 50 నగరాల ఎంపిక
- మార్చి 2017లోగా పూర్తి పారిశుద్ధ్యం

**ఈనాడు, దిల్లీ:** స్వచ్ఛభారత్ లక్ష్యాలను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తిగా అమలుచేయాల్సిన ఆధ్యాత్మిక నగరాల జాబితాలో తిరుపతికి చోటు లభించింది. హరిద్వార్, అలహాబాద్‌లకూ స్థానం దక్కింది. స్వచ్ఛభారత్ లక్ష్యాలను గతంలో అనుకున్నట్లుగా 2 అక్టోబర్ 2019 నాటికి కాకుండా.. అంతకంటే ముందుగా మార్చి 2017 నాటికి పూర్తిచేసే విధంగా దేశవ్యాప్తంగా 50 నగరాలను కేంద్రం ఎంపిక చేసినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. లక్ష్యాల సాధన కోసం ఈ నగరాలకు కేంద్రం ప్రత్యేక నిధులను మంజూరు చేయనుంది. వీటిని ఉపయోగించుకొని.. వ్యక్తిగత, పబ్లిక్ మరుగుదొడ్ల నిర్మాణం, బహిరంగ మలవిసర్జన లేకుండా చర్యలు తీసుకోవటం, ఇంటింటినుంచీ వ్యర్థాల సేకరణ, శాస్త్రీయ పద్ధతిలో వ్యర్థాల (మిగతా 2లో)

# స్వచ్ఛభారత్ నగరాల్లో తిరుపతి

(మొదటి పేజీ తరువాయి) నిర్మూలన, బహిరంగప్రదేశాల్లో చెత్త వేసే వారికి జరిమానా విధించటం వంటి లక్ష్యాలను సాధించాల్సి ఉంటుంది. ఈ ఏడాది మార్చి 31 వరకూ స్వచ్ఛభారత్ అమలులో సాధించిన ప్రగతి ఆధారంగా 50 నగరాలను ఎంపిక చేసినట్లుగా ప్రధానమంత్రి కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో ప్రతిపక్ష నేతల ప్రభావం ఉన్న నగరాలకు, నియోజకవర్గాలకు కూడా అవకాశం కల్పించారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ పార్లమెంటరీ నియోజకవర్గం రాయ్‌బరేలి, సమాజ్‌వాదీపార్టీ అధినేత ములాయంసింగ్‌యాదవ్‌కు పట్టున్న మెయిన్‌పురి, ఎటావా, కన్నౌజ్ నగరాలు, బిహార్ సీఎం నితీశ్‌కుమార్‌కు పట్టున్న బార్, మొకామా నగరాలను చేర్చారు.

**గ్రామాలకూ ర్యాంకులు..** పారిశుద్ధ్యం విషయంలో నగరాలకు ర్యాంకులను ఇచ్చిన కేంద్రం.. గ్రామాలకు ర్యాంకులను ఇవ్వాలని తాజాగా నిర్ణయించింది. మరుగుదొడ్ల సదుపాయం, బహిరంగ మలవిసర్జన లేకపోవటం, వ్యర్థాలను సురక్షితంగా నిర్మూలించటం వంటి అంశాల ప్రాతిపదికన ర్యాంకులను ఇవ్వనున్నారు. దీనికోసం జూన్‌లో దేశవ్యాప్తంగా గ్రామీణప్రాంతాల్లో ఒక సర్వేను నిర్వహించనున్నారు.